# 3

# భగవంతుడు భావప్రియుడు

*ప్రేమస్వరూపులారా!* మానవునియందు అహంకారమున్నంతవరకు ఆలుబిడ్డలుకూడా అతనిని ప్రేమించరు. అహంకారము మానవుణ్ణి అధఃపతనము గావిస్తుంది. ఏనాడు అహంకారమును చంపుకొనునో ఆనాడు యావత్ప్రపంచం అతనిని ప్రేమిస్తుంది. క్రోధమున్నంతవరకు మానవునికి దుఃఖం తప్పదు. ఏనాడు క్రోధమును దూరం గావించుకొనునో ఆనాడు అందరూ అతనిని గౌరవిస్తారు. లోభము మానవుణ్ణి అనేక కష్టాలకు గురిచేస్తుంది. అహంకారము, క్రోధము, లోభములే మానవుణ్ణి దానవునిగా మార్చుతున్నవి. ఈ దుర్గుణాలను నిర్మూలించుకున్నప్పుడు మానవుడు తాను ఆనందాన్ని అనుభవించడమేగాక సర్వులకు ఆనందమును అందించగలడు.

ప్రేమస్వరూపులారా! ఈ లోకములో దేనిని తెలుసుకుంటే సర్వమును తెలుసుకున్నవారవుతారో దానిని తెలుసుకోవాలి. ఆ ఒక్కదానిని మరచితే ఇంక దేనిని తెలుసుకున్నప్పటికీ ప్రయోజనం లేదు. ఒకటి తరువాత పెట్టే సున్నలకు విలువ పెరుగుతుంది. ఆ ఒకటిని తీసివేస్తే దాని ప్రక్కనున్న సున్నలన్నీ విలువను కోల్పోతాయి. ఆత్మాభిమానమును ఒకటితో పోల్చవచ్చును. ఆత్మాభిమానమును ఉంచుకున్న తరువాత ఎన్ని అభిమానములను పెంచు కున్నప్పటికీ వాటికి విలువ పెరుగుతుంది. మనం జగత్తులో ఎన్ని భోగభాగ్యముల ననుభవించినప్పటికీ ఆత్మాభిమానమే లేకపోతే అన్నీ వ్యర్థమైనవే.

### దైవార్పితభావంతో చేసేదే నిజమైన సేవ

వేదము "ఈశావాస్య మిదం సర్వం" అన్నది. ఈశ్వరుడనగా ఎవరు? సర్వజీవులందు సంచరించే చైతన్యమే ఈశ్వరత్వం. నిరంతరం ఈశ్వర నామమును స్మరించినప్పుడే మనకు తరించడానికి అవకాశం కల్గుతుంది. నామస్మరణ చేస్తూ, సేవలు సల్పుతున్న భక్తులు భారతదేశంలో కోట్లాదిమంది కలరు. జపతపాదులచేతగాని, తీర్థయాత్రలచేతగాని, శాస్త్రపఠనంచేతగాని ముక్తి లభించదు. సంసార సాగరమును తరించాలంటే సజ్జనుల సేవ చేయాలి. సేవ చాలా ప్రధానమైనది. ప్రతి ప్రాణియందు దైవము కలదని విశ్వసించి, సకల ప్రాణులను ప్రేమించాలి, సేవించాలి. సేవలందు అహంకారమును చంపుకోవాలి. "నేను సేవ చేస్తున్నాను" అనే అహంకారమున్నంత వరకు అది సేవ అనిపించుకోదు. "సర్వ కర్మ భగవత్ప్రీత్యర్థం" అనే భావంతో సేవలు చేయాలి. ఎందరో సేవలు చేస్తున్నారు. కాని, వాటి ఫలితమును అనుభవిస్తున్నారా? సేవలయొక్క ప్రధానమైన అంతరార్థమును గుర్తించాలి. తనను తాను మరచి, చేసే సేవలను భగవంతునికి అర్పితం గావించినప్పుడే అది నిజమైన సేవగా రూపొందుతుంది. చేసే సేవ చిన్నదైనప్పటికీ అది భగవత్ప్రీత్యర్థంగా భావించి చేసినప్పుడు అదే ఘనమైనదిగా మారిపోతుంది.

### చేసేది, చేయించుకునేది ఒక్కడే

ఎవరికి ఎవరు సేవచేస్తున్నారు? ఎవరు చేయించుకుంటున్నారు? చేసేది, చేయించుకునేది ఒక్కడే. "ఏకాత్మా సర్వ భూతాంతరాత్మా", "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి". ఉన్నది ఒక్కడే. చేసేది ఒక్కరికే. "ఏక్ ప్రభూకె అనేక నామ్", నామములు వేరైనా ప్రభువు ఒక్కడే. కనుక, మనకు రూపనామములు ముఖ్యం కాదు. భావ శుద్ధియే నిజమైన భక్తి. భగవంతుడు భావప్రియుడేగాని, బాహ్య ప్రియుడు కాదు. భావప్రియుడైన భగవంతునికి

మనం పవిత్రమైన భావంతో సేవలు చేయాలి. జీవితాన్నే సేవాయోగంగా మార్చుకోవాలి. 76 దినములనుండి భజనలు మరియు గ్రామసేవలు చేసుకుంటూ బెజవాడనుండి భక్తులు ఈరోజున ఇక్కడికి వచ్చారు. ఇంతేగాక, శిరిడీనుండి వేయిమందికి పైగా భక్తులు అనేక క్షేత్రములు దర్శించి కన్యాకుమారినుండి ఇక్కడికి వచ్చారు. భగవంతుడు సేవకోసమే ఈ దేహమునందించాడు. ఈ దేహమును సార్థకం గావించుకునే నిమిత్తం సత్కర్మలలో ప్రవేశించాలి. సద్భావంతో సమాజసేవలో పాల్గొనడమే మానవుని ప్రధాన కర్తవ్యం. ప్రేమతో సేవచేసే నిమిత్తం ప్రసాదింపబడిన పనిముట్టు ఈ దేహం అని మీరు భావించాలి. అందరియందు భగవంతుడు సాక్షీభూతుడై నిలిచియున్నాడు. మీ ఉచ్ఛ్వాసనిశ్వాసములు దినమునకు 21,600 పర్యాయములు “సో... హం” (అది నేనే) అని ప్రబోధిస్తున్నాయి. ఇట్టి అంతర్ ప్రబోధను విస్మరించి మానవుడు ఎందుకింత మూర్ఖంగా ప్రవర్తిస్తున్నాడు? ఎవరు చేస్తున్నారు ఈ పనులంతా? చేసేవాడు, చేయించుకునేవాడు ఒక్కడే. అన్నింటికీ ఒక్కడే ఆధారం. మీ మాటలు, మీ పనులు, మీ శ్రవణం అన్నీ ఒక్క దైవముద్వారానే జరుగుతున్నాయి. కనుక, మీరు సేవలు ఎవరికో చేయడం లేదు, మీకే మీరు చేసుకుంటున్నారు. ఇట్టి ఏకాత్మభావమును పెంచుకోవడానికి కృషి చేయాలి.

### భగవంతుడు మీయందే ఉన్నాడు

‘అహం బ్రహ్మాస్మి’, ‘తత్త్వమసి’, ‘ప్రజ్ఞానం బ్రహ్మ’, ‘అయమాత్మా బ్రహ్మ’ – ఈ నాల్గు మహావాక్యములు నాల్గు వేదములు ప్రపంచానికి అందించిన మహాబోధలు. ఇలాంటి వేదవాక్యములను మానవు డెందుకు మరచి పోయాడు? అడుగడుగునకూ తన ప్రతిబింబము కనిపిస్తూనే ఉన్నది. ప్రతి శ్వాసయందు దివ్యత్వము ప్రకాశిస్తూనే ఉన్నది. దైవోన్మాదిగా జీవితాన్ని గడపవలసింది పోయి మానవుడు ఏమీ తెలియని మూర్ఖునివలె ప్రవర్తిస్తున్నాడు. తాను అజ్ఞాని కాడు. తాను ప్రజ్ఞాని, సుజ్ఞాని. ఈ సత్యాన్ని గుర్తించాలి. మీరు భోజనం చేసేముందు “బ్రహ్మార్పణం బ్రహ్మహవిః” అని ప్రార్థన చేస్తుంటారు. అయితే, బ్రహ్మ ఎక్కడున్నాడు? మీలోనే ఉన్నాడు. కనుకనే, తక్షణమే మీ లోపలినుండి జవాబు వస్తున్నది. ఏమని? “అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ...” “ఓ పిచ్చిమానవుడా! నేను వైశ్వానరరూపంలో నీ ఉదరమునందే ఉన్నాను” అని జవాబు వస్తున్నది. మీరు “బ్రహ్మార్పణం...” అంటూ మీ ఉదరమునందే ఉన్న భగవంతునికి అర్పితం గావిస్తున్నారు. మీరు మేలు చేసినా, కీడు చేసినా మీకు మీరే చేసుకుంటున్నారుగాని, పరులకు కాదు. ఎందుకంటే అందరియందున్న దైవత్వం ఒక్కటే. “సర్వ జీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి”, “సర్వ జీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి.” ఇట్టి ఏకాత్మతత్త్వాన్ని విస్మరించి మీరు పుణ్యక్షేత్రాల చుట్టూ తిరుగుతున్నారు, దైవనామాన్ని స్మరిస్తున్నారు. ఏ పేరు పెట్టి పిలిచినా పలికేది ఒకే దైవము, ఏ క్షేత్రాన్ని సందర్శించినా ఉన్నది ఒకే దైవము. అక్కడ, ఇక్కడ, ఎక్కడ చూసినా భగవంతుడు ఒక్కడుగానే ఉన్నాడు. కనుక, మీరు ఏకత్వాన్ని అనేకత్వంగా విభజించకండి, అనేకత్వంలో ఉన్న ఏకత్వాన్ని దృష్టిలో ఉంచుకోండి. ఇదియే ఈనాడు మీరు చేయవలసిన ప్రధానమైన సేవ.

### సత్యసాయి సంస్థలయొక్క ప్రధానమైన విలువలు

మీయందే ఉన్న దైవత్వాన్ని స్మరించండి. “మన్ మే రామ్, హాత్ మే కామ్” మనస్సులో భగవంతుణ్ణి స్మరించండి, చేతులతో కర్మలను ఆచరించండి. అప్పుడు మీరు ఆచరించే సమస్త కర్మలూ భగవత్ప్రీత్యర్థంగానే రూపొందుతాయి. దైవభావంతో మీరు సేవలలో పాల్గొని, అందరికీ మీ ప్రేమను పంచుతూరావాలి. కాని, ఈనాడు సేవలందు మీకు విశ్వాసము అభివృద్ధి కావడంలేదు. ఇన్ని సంవత్సరాలనుండి మీరు స్వామి సందేశాలను వింటున్నారు, సేవలు చేస్తున్నారు. కాని, ఏమి సాధించారు? ఏమి తెలుసుకున్నారు? మొట్టమొదట మీ దృష్టిలో, మీ మాటలలో, మీ నడతలో మార్పు రావాలి. సమ్యక్ దృష్టిని, సమ్యక్ శ్రవణమును, సమ్యక్ వాక్కును అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడే మీరు నిర్వాణమును పొందగలరు. మొట్టమొదట సమ్యక్‌దృష్టిని పోషించుకోవాలి.

ఏదో దేవాలయాలకు వెళ్ళినప్పుడో, పుణ్యక్షేత్రములను సందర్శించినప్పుడో దైవానికి నమస్కరిస్తే సరిపోదు. ఎవరికి నమస్కరించినా అది దైవానికే చెందుతుందనే సత్యాన్ని గుర్తించాలి. దైవములేని దేహము లేనేలేదు. భగవంతుడు సర్వ భూతాంతరాత్మ. ఇట్టి సత్యాన్ని గుర్తించి వర్తించడమే మానవుని ప్రధానకర్తవ్యం. మానవుడు ఎన్నియో వేదాంత ప్రబోధలు వింటున్నాడు, ఎన్నియో సద్గ్రంథాలు చదువుతున్నాడు, ఎన్నియో పుణ్యక్షేత్రాల చుట్టూ తిరుగుతున్నాడు. కాని, ప్రయోజన మేమిటి? మనస్సు కించిత్తైనా మారటం లేదు. శిలాహృదయునిగా మారిపోతున్నాడు. వెన్నవంటి హృదయం, వెన్నెలవంటి మనస్సు, తేనెవంటి పలుకు – ఇవియే సత్యసాయి సంస్థల యొక్క ప్రధానమైన విలువలు. ఇవియే మనిషికి నిజమైన అలంకారాలు.

### పశుత్వాన్ని వీడి దివ్యత్వాన్ని పొందడమే ఆధ్యాత్మికం

ప్రేమస్వరూపులారా! మానవత్వాన్ని పొందగల్గడం ఎంత అదృష్టమో! ఇది అనేక జన్మల పుణ్యఫలితంగా లభించిన భగవంతుని అనుగ్రహ ప్రసాదం. ఇట్టి మానవత్వాన్ని దుర్వినియోగపరచుకోకండి. ఎవరైనా ఏదైనా అడిగితే తీయని మాటలతో జవాబునందించండి, నగుమోముతో నమస్కరించండి. ఇట్టి పవిత్రమైన గుణములు ఈనాటి మానవులయందు కనిపించడంలేదు. ఇలాంటివారు భక్తులెలా కాగలరు? దేహము దేవాలయాలకు వెళుతున్నప్పటికీ మనస్సు దుర్మార్గంలో ప్రవేశిస్తున్నది. ఏమి ప్రయోజనం? మొట్టమొదట మనస్సును సన్మార్గంలో ప్రవేశపెట్టాలి. మానవుణ్ణి కేవలం మానవునిగా భావించుకోవద్దు. జీవుడే దేవుడని విశ్వసించాలి. ఇదియే భారతీయులయొక్క వేదాంతసారము. “ఈశ్వర స్సర్వ భూతానాం.” సర్వ జీవులయందు సంచరించే దైవత్వము ఒక్కటే. ఇదే చైతన్యతత్త్వము. ఇట్టి పవిత్రమైన భావాన్ని హృదయంలో నింపుకొని జీవితాన్ని సార్థకం గావించుకోవాలి. మీరు మానవులుగా జన్మించారు. కాబట్టి, మానవులుగా జీవించండి, వానర బుద్ధులకు చోటివ్వకండి. “నేను మానవుడను, మానవుడను...” అని పదేపదే జ్ఞాపకం చేసుకోండి. ఆధ్యాత్మికమంటే ఏమిటి? ఏదో పూజలు చేయడం, భజనలు చేయడం... ఇంతమాత్రమే కాదు. మీలో ఉన్న పశుత్వాన్ని నిర్మూలించుకొని, మీ మానవత్వాన్ని దివ్యత్వంగా మార్చుకోవడమే ఆధ్యాత్మికం. పశుత్వాన్ని వీడనంతవరకు మానవత్వము దివ్యత్వాన్ని చేరదు. కాని, ఈనాటి మానవునిలో దినదినమునకూ పశుత్వము పెరిగిపోతున్నది. పవిత్రమైన మానవత్వమును పొంది, తనయందే ఉన్న దివ్యత్వమును అర్థం చేసుకోలేక కాలాన్ని వ్యర్థం చేస్తున్నాడు మానవుడు. భయపడేది పశువు, భయపెట్టేది మృగము. తాను పశువు కాదు, మృగము కాదు. తాను మానవుడు. కాబట్టి, జీవితంలో ఎలాంటి పరిస్థితినైనా ధైర్యసాహసాలతో ఎదుర్కోవాలి.

### భగవంతుడు క్వాలిటీ చూస్తాడు, క్వాన్టిటీ కాదు

ప్రేమస్వరూపులారా! సాయిబాబా నిత్యం చెప్తున్నవే కదా ఇవి, అని ఈ మాటలను అలక్ష్యం చేయకండి. మానవునియందున్న దివ్యశక్తి ఇంత, అంత అని వర్ణించడానికి వీలుకాదు. భగవంతుడు అణువుకంటే అతి సూక్ష్మమైనవాడు, ఘనముకంటే అతిగణనీయుడు. కనుక, భగవత్తత్త్వము ఇట్టిది, అట్టిది అని ఊహించుకోవడం అమాయకత్వమే. భగవత్తత్త్వాన్ని ఎవ్వరూ వర్ణించలేరు. మానవుడు చేసే వర్ణనలన్నీ తన తృప్తికోసమే. అణువునందు, ఘనమునందు ఒకే తత్త్వమున్నది. సముద్రానికి వెళ్ళి కొంచెం నీటిని చేతిలో తీసికొని నోట్లో వేసుకోండి. అది ఉప్పగా ఉంటుంది. సముద్రానికి వెళ్ళి ఒక బిందెలో నీళ్ళు నింపుకొనిరండి. అది కూడా ఉప్పగానే ఉంటుంది. క్వాన్టిటీలో తేడా ఉంటుందిగాని, క్వాలిటీ ఒక్కటే. భగవంతుడు ఎప్పుడూ క్వాలిటీనే చూస్తాడుగాని, క్వాన్టిటీని చూడడు. కడవల కొలదీ గాడిద పాలెందుకు? గంగగోవు పాలు ఒక గరిటెడు త్రాగినా సంతోషమే. మీరు క్వాన్టిటీకోసం ప్రాకులాడవద్దు, క్వాలిటీని దృష్టిలో పెట్టుకోండి. అధికంగా ఆశించి నిరాశ చెందవద్దు. దురాశ దుఃఖానికి హేతువు.

ప్రేమస్వరూపులారా! ఈనాడు అనేకమంది అనేక మార్గాలలో భగవంతుణ్ణి అన్వేషిస్తున్నారు. ఎక్కడున్నాడు భగవంతుడు? ఎక్కడ చూసినా ఉన్నాడు. అట్టి భగవంతుణ్ణి వెతకడమెందుకు? "ఇందు గలడందు లేదని సందేహము వలదు, చక్రి సర్వోపగతుం డెందెందు వెదకిచూసిన అందందె గలడు" అన్నాడు చిన్నపిల్లవాడైన ప్రహ్లాదుడు. గురువులైన చండ, అమర్కులు అతనిని చాలా కఠినంగా శిక్షిస్తూ వచ్చారు. కాని, ప్రహ్లాదుడు చలించలేదు. తన లక్ష్యమును దైవంపైన ఉంచుకున్నాడు. ఒకనాడు తండ్రి అతనిని పిలిపించి "నాయనా! నీవు చాలా గొప్పవిద్యలు నేర్చినావట. ఏదీ, నీవు నేర్చుకున్నదేమిటో చెప్పు చూద్దాం", అన్నాడు. ప్రహ్లాదుడు చెప్పాడు:

"చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్యశాస్త్రంబులు; నే
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల జదివితి దండ్రీ!"

"ఆ మర్మమేమిటో చెప్పు నాయనా!" అని అడుగగా ప్రహ్లాదుడు "ఓం నమో నారాయణాయ" అన్నాడు. తండ్రికి బుఱ్ఱ తిరిగింది. ప్రహ్లాదుణ్ణి రెండు కొట్టి పంపించాడు. హరిప్రియుడు ప్రహ్లాదుడు. హిరణ్యకశిపుడు హరిద్వేషి. తండ్రికి, కుమారునికి ఎంత వ్యత్యాసం! ప్రేమచేతనే మానవత్వాన్ని దైవత్వముగా మార్చుకోవచ్చు. అహంకారమును హతమార్చినప్పుడే ప్రేమతత్త్వం అభివృద్ధి చెందుతుంది.

**కలిలో నామస్మరణే తరణోపాయం**

విద్యార్థులారా! యాత్రికులారా! సాధకులారా! మీకు ఏ జపములూ, ఏ ధ్యానములూ, ఏ సాధనలూ చేయడానికి వీలుకాకపోయినప్పటికీ ఫరవా లేదు; నామస్మరణ చేయండి. అర్థం కాని సాధనలలో ప్రవేశించవద్దు. నామస్మరణ అనే సులభమైన మార్గంలో ప్రవేశించి మీ జీవితాలను సార్థకం చేసుకోండి. కృతయుగంలో ధ్యానం, త్రేతాయుగంలో యజ్ఞం, ద్వాపర యుగంలో అర్చన, కలియుగంలో నామస్మరణ తరణోపాయములుగా పేర్కొనబడినాయి.

హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలం
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతి రన్యథా

కనుక, నామస్మరణతో తరించడానికి ప్రయత్నించండి. దైవత్వమును పొందడానికి నవవిధ భక్తిమార్గములున్నాయి.

శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం
వందనం అర్చనం దాస్యం సఖ్యమాత్మనివేదనం

మార్గములు ఎన్నైనా గమ్యం ఒక్కటే. కనుక, గమ్యాన్ని చేరుకోండి. పరదూషణలోనూ, ప్రేమకు విరుద్ధమైన మార్గంలోనూ ప్రవేశించి గమ్యానికి దూరం కావద్దు. స్వార్థము ఆధ్యాత్మికానికి అతి దూరం. కనుక, మీరు స్వార్థాన్ని త్యాగం చేసి పరార్థాన్ని ప్రేమించాలి, దివ్యత్వానికి అంకితం కావాలి.

**క్షేత్రములు వేరుగాని, క్షేత్రజ్ఞుడు ఒక్కడే**

ఈనాడు శిరిడీనుండి వేయిమందికి పైగా యాత్రికులు పవిత్రమైన నామస్మరణ చేస్తూ, అనేక పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ ప్రశాంతి నిలయం చేరుకున్నారు. అయితే, క్షేత్రములు వేరు కావచ్చుగాని, క్షేత్రజ్ఞుడు ఒక్కడే అనే సత్యాన్ని గుర్తించాలి. గీతాచార్యుడు "క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి" అన్నాడు. మీరు ఎన్ని క్షేత్రములు తిరిగినా

మొట్టమొదట మీ హృదయక్షేత్రమును పవిత్రం గావించుకోండి. కఠినమైన మాటలు తగ్గించుకోండి. పరదూషణ మానుకోండి. పరులచింతను వీడి పరమాత్మ చింతన చేయండి. చేతనైనంతవరకు పరులకు సహాయం చేయండి. మీరు చేసే సేవ సార్థకమైనదిగా ఉండాలి. మా పాతవిద్యార్థులు చాలామంది బ్రాహ్మణ పల్లి, బీడుపల్లి మున్నగు గ్రామాలలో సేవలు చేస్తున్నారు. అయితే, సేవలు ఎట్లా చేయాలి? పరిశుద్ధమైన భావంతో చేయాలి. "అయ్యా! మేము మీ గ్రామంలో సేవ చేయడానికి వచ్చాము. మీరుకూడా మాతో చేరండి. మేము నెలకో, రెండు నెలలకో ఒకసారి మీ గ్రామానికి వస్తాము. కాబట్టి, మీరు మమ్మల్ని చూసి నేర్చుకుంటే నిత్యం మీ గ్రామంలో మీరు సేవచేసుకోవచ్చు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి. లేకపోతే మీరు, మీ పిల్లలు భయంకరమైన రోగాలకు గురికావలసి వస్తుంది," అని చెప్పాలి. పరిసరాలతోపాటు హృదయాన్నికూడా పరిశుద్ధంగా ఉంచుకోవాలి. సంకల్పములు, దృష్టి, శ్రవణము, వాక్కు, కర్మలు – ఈ ఐదింటినీ పవిత్రం గావించుకోవాలి. అప్పుడే మీకు సాయుజ్య ప్రాప్తి కల్గుతుంది. మొదటిది సాలోక్యం. రెండవది సామీప్యం. మూడవది సారూప్యం. నాల్గవది సాయుజ్యం. అనగా దివ్యత్వంతో ఏకం కావచ్చు.

**మానవుడు పుట్టింది దేనికోసం?**

నది ఎంతో దూరము ప్రవహించి కట్టకడపటికి సముద్రములో చేరిపోతుంది. "నదీనాం సాగరో గతిః" నది పుట్టినది దేనికోసం? సముద్రములో చేరడంకోసమే. అదేవిధంగా, మానవుడు పుట్టినది దేనికోసం? ఏదో ఈ ప్రపంచంలో సుఖాలను అనుభవించడానికి కాదు. అవి ఎన్నైనా అనుభవించవచ్చు. కాని, కట్టకడపటికి దైవంలో ఐక్యం కావాలి. ఈ జీవితం ఎందుకోసం వచ్చిందని ప్రశ్న వేసుకోండి. మానవుడు దైవాన్ని చూడటానికి వచ్చాడు, దైవాన్ని చేరడానికి వచ్చాడు, దైవాన్ని అనుభవించడానికి వచ్చాడు. కాని, ఈనాటి మానవుడు దైవాన్ని చూడటం లేదు, దైవాన్ని చేరడం లేదు, దైవాన్ని అనుభవించడం లేదు. తాను లౌకికసుఖాలను అనుభవించడానికి జన్మించానని భావిస్తున్నాడు. మానవజన్మ ఇట్టి తుచ్ఛమైన వాంఛలకోసం వచ్చింది కాదు. ఇది పవిత్రమైనది, దివ్యమైనది, ధన్యమైనది. ఇట్టి జన్మను వ్యర్థం గావించుకో కూడదు.

ప్రేమస్వరూపులారా! దివ్యమైన నామస్మరణచేత మీ కాలమును సార్థకం గావించుకోండి. నడుస్తూ నామస్మరణ చేసుకోవచ్చు, పడుకొని నామస్మరణ చేసుకోవచ్చు, ప్రయాణం చేస్తూ నామస్మరణ చేసుకోవచ్చు. నామస్మరణ కొక హద్దు లేదు, అడ్డు లేదు. నీరు కావాలంటే ట్యాక్సు కట్టాలి, కరెంటునుపయోగించుకోవాలంటే ట్యాక్సు కట్టాలి. కాని, నామస్మరణకు ట్యాక్సు అడిగేవారు లేరు. దీనిని ఆచరించడం చాలా సులభం. మానవుడు ఇట్టి సులభమైన మార్గాన్ని వదలిపెట్టి, కష్టంతోకూడిన సాధనలే చాలా మంచివని భావిస్తున్నాడు. ఎట్టి కష్టములూ లేకుండా సులభంగా ఉన్నచోటే నామస్మరణ చేసుకుంటూ తరించవచ్చు. ఐతే, అది ప్రేమతో చేయాలి. ప్రేమయే నిజమైన భక్తి. ప్రేమ లేనిది భక్తి కానేరదు. జపము, తపము, ధ్యానము, యజ్ఞము మున్నగు సాధనలన్నింటికీ ప్రేమయే ప్రధానం. లౌకికమునందుగాని, ఆధ్యాత్మికమునందుగాని, ఆస్తికునికిగాని, నాస్తికునికి గాని ప్రేమయే ప్రధానం. అట్టి పవిత్రమైన ప్రేమతత్త్వాన్ని మీరు పెంచుకోండి.

*"హరే రామా హరే రామా రామరామా హరేహరే*
*హరే కృష్ణా హరే కృష్ణా కృష్ణ కృష్ణా హరేహరే*
*సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం*
*నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః"*

(తేది: 24.02.2002 సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశమునుండి)